క్లుప్తంగా

అమ్మవారికి హోమాలు

మదనపల్లె సిటీ: వారాహీ నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక అయ్యప్పనగర్‌లోని బాల అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం హోమాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీ లలిత త్రిపురసుందరిదేవి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. వారాహి అష్టోత్తరం,లలిత సహస్రనామస్తోత్రపారాయణం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు పాఠశాలలకు ఐచ్ఛిక సెలవు

రామసముద్రం: మొహర్రం పండుగను పురస్కరించుకుని మంగళవారం అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఆప్షనల్ హాలిడే ప్రకటిస్తున్నట్లు ఎంఈఓ హేమలత తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఐచ్ఛిక సెలవు ఉపయోగించుకునే అవకాశం ఉన్నందున డీఈఓ ఆదేశాల మేరకు పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు.

బీటీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్‌గా డాక్టర్ బాబు

మదనపల్లె సిటీ: బీటీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కడప విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బాబు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషాను కలిశారు. కాలేజీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు గురించి చర్చించారు. కాలేజీలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపుపై కేసు


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

బి.కొత్తకోట: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ నాగరాజుగౌడ్ సోమవారం తెలిపారు. మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ గండువారిపల్లెకు చెందిన కూరాకుల చలపతి (33) గుమ్మసముద్రం చెరువు వంక నుంచి ఇసుకను ట్రాక్టర్‌లోకి లోడు చేస్తుండగా అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. ఇసుక తరలింపునకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించగా లేవని సమాధానం ఇవ్వడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని చలపతిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

20న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 20న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. అల్ట్రా డీలక్స్ బస్సులు ఏర్పాటు చేశామని రాను, పోను చార్జి రూ.805 చెల్లించాలన్నారు. టిక్కెట్లు కోసం 7382875034, 7392876638ను సంప్రదించాలని కోరారు.

30 లక్కీడిప్ డ్రా:
మదనపల్లె–బి.కొత్తకోట రూటులో ఈనెల 30న లక్కీడిప్ డ్రా తీయనున్నట్లు డీఎం తెలిపారు. ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు టిక్కెట్టు వెనుకభాగంలో పేరు, మొబైల్ నంబర్, ఊరు పేరు రాసి బస్సులోని గిఫ్ట్ బాక్సులో వేయాలని కోరారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ


విద్యార్థులతో ఎంఈఓ, ఫౌండేషన్ సభ్యులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జనసేవా ఫౌండేషన్ వారు సోమవారం ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు విరాళంగా అందజేశారు. మండలంలోని మద్దయ్యగారిపల్లి పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నారాయణ పాల్గొని చిన్న వయస్సులోనే ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గణేష్, హరీష్‌లనుఅభినందించారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేసిన వారికి బిల్లులు

పెద్దతిప్పసముద్రం: పక్కా గృహాలు మంజూరై ఇంత వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు వెంటనే పనులు చేపట్టాలి. నిర్మాణాలు పూర్తి చేసిన వారికి బిల్లులు మంజూరు అవుతాయని ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 400 మందికి పైగా లబ్ధిదారులు పునాదుల పనులు కూడా చేపట్టలేదని ఆన్‌లైన్ రికార్డులు చెబుతున్నాయన్నారు. మరి కొంత మంది పునాదుల కోసమని ముందస్తుగా బిల్లులు కూడా తీసుకున్నా నిర్మాణాలు మాత్రం చేపట్టలేదన్నారు. అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణ పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాలని హౌసింగ్ అధికారులను ఆదేశించామన్నారు.

హామీ అమలు చేయాలి



ఎన్నికల్లో ప్రజలకు ఎక్కువ హామీలు ఇచ్చి టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ హామీలను అమలు చేయాల్సిందే. హామీలు అమలు చేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఆశతో ఉన్నారు. వీరికి ఉద్యోగాలు కల్పిస్తారా లేక నిరుద్యోగ భృతి ఇస్తారా అన్నది దానిపై ప్రభుత్వం శాశ్వత ప్రయోజనం కలిగే ఉద్యోగాలను కల్పించడం ప్రభుత్వ బాధ్యత. నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలుపుకోవాలి.

– పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే

షరతులు లేకుండా భృతి ఇవ్వాలి



గ్రామంలో అందరూ వ్యవసాయం చేసుకుంటుంటే, సేద్యం నీకెందుకు, చదువుకోమని తల్లిదండ్రులు కాయకష్టం చేసి మరీ చదివించారు. డిగ్రీ పూర్తిచేసి ఎనిమిదేళ్లవుతోంది. ఉద్యోగం రాకపోవడంతో కుటుంబపోషణ కోసం కార్పెంటర్‌గా పనిచేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం లేదా రూ.3వేలు నిరుద్యోగభృతి ఇస్తామని చెప్పింది. ఎటువంటి షరతులు లేకుండా భృతి ఇవ్వాలి.

– రామాంజులు, జమ్ముకుంటపల్లె, మదనపల్లె

భృతినివ్వు... బాబూ

- ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి హామీ
- అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటినా పట్టించుకోని వైనం

మదనపల్లె/పీలేరు/బి.కొత్తకోట: ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించింది. ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. ఉద్యోగాలు కల్పించేంత వరకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని వాగ్దానం చేసింది. ఈ విషయాన్ని ఎన్నికల ప్రచారంలో ఊదర గొట్టారు. దీంతో నిరుద్యోగులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు దాటినా ఇంత వరకు ఈ పథకం అమలుకు నోచుకోలేదు. డీఎస్సీ తప్ప మిగతా ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు విడుదల చేయలేదు.జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. అంత వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వెంటనే నిరుద్యోగ భృతి హామీ అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వాస్తవానికి 2014 ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటైన నాలుగేళ్ల వరకు ఆ ఊసే లేదు. చివరి సంవత్సరంలో రూ.2 వేల చొప్పున కొందరికి మాత్రమే నిరుద్యోగ భృతి చెల్లించారు. మునుపటి అనుభవాలను గుర్తు చేసుకుంటున్న నిరుద్యోగులు మళ్లీ అదే పరిస్థితి వస్తుందేమోనని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సారైనా వెంటనే నిరుద్యోగ భృతి పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.



నిరుద్యోగ భృతి ప్రకటించాలి...



డిగ్రీ చదివినప్పటికీ ఇప్పటివరకు మంచి ఉద్యోగం రాలేదు. బయటకు ఎక్కడైనా కోచింగ్‌లకు వెళ్లామంటే వేలల్లో ఖర్చుచేయాల్సిన పరిస్థితి. ఖర్చుకు భయపడి, ఇంటిపట్టునే ఉంటూ చిన్నాచితకా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్నాను. కూటమిప్రభుత్వం నిరుద్యోగభృతి రూ.3వేలు ఇస్తామని చెప్పింది.. ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

– మధు, ఉగ్రారపువారిపల్లె, చీకలబైలు

ప్రస్తావన లేకపోవడం బాధాకరం...



కూటమిప్రభుత్వం ఏర్పాటై నెలరోజులు పూర్తయినప్పటికీ...సూపర్‌సిక్స్‌లోని ప్రధానహామీ నిరుద్యోగ భృతి గురించి ఇప్పటివరకు ప్రస్తావించకపోవడం నిరుద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోంది. గతంలో మాదిరి నిరుద్యోగులను మోసం చేయకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు కల్పించేవరకు నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే.

– మాధవ్, ఏఐఎస్ఎఫ్, జిల్లా అధ్యక్షులు

మదనపల్లె నియోజకవర్గం

మండలం	నిరుద్యోగుల సంఖ్య
మదనపల్లె మున్సిపాలిటీ	25,500
నిమ్మనపల్లె	6500
రామసముద్రం	9,250

పీలేరు నియోజకవర్గం

మండలం	నిరుద్యోగుల సంఖ్య
పీలేరు	5000
కలికిరి	3000
కేవీపల్లె	2000
కలకడ	2000
గుర్రంకొండ	2500
వాల్మీకిపురం	2500

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు



ఎంబీఏ వరకు చదివి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నా. ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే వరకు నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఎంబీఏ పూర్తి చేశాక ఉద్యోగం ప్రయత్నాల్లో ఉన్నాను. ప్రభుత్వ ఉద్యోగం వచ్చేంతవరకు భృతి అందించాలి. భృతి ఇచ్చే విషయంలో కొర్రీలు వేయకుండా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.

– ఎం.సందీప్, అంగళ్లు, కురబలకోట

ఎదురుచూస్తున్నాం



పెద్దతిప్పసముద్రంకు చెందిన నా పేరు బి.షేక్ షానూ. డిగ్రీ వరకు చదువుకున్నాను. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తామంటే ప్రజలు నిరుద్యోగులు నమ్మి ఆశలు పెంచుకున్నారు. ఇచ్చిన మాట మేరకు వెంటనే నెలవారి భృతి ఇచ్చి అర్హులైన వారికి ఇంటికో ఉద్యోగం ఇస్తే పిల్లల చదువులకు, కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంటుంది.

– షేక్ షానూ, పెద్దతిప్పసముద్రం

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి...



బీటెక్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాను. ఇంటర్వ్యూలకు, ఉద్యోగాలకు దరఖాస్తు చేసేందుకు ఇంటిలో వారిని అడగాలంటే ఇబ్బందిగా ఉంటోంది. నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భృతి రూ.3వేలు అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఉద్యోగం వచ్చేంతవరకు ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి. అలాగే వీలైనంత త్వరగా జాబ్ కేలండర్ ప్రకటించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

– నందకుమార్, కజన్స్‌రోడ్, మదనపల్లె

ఉద్యోగాలు ఇవ్వాలి



ఎన్నికల్లో ప్రతి ఇంటికి ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. గద్దెనెక్కిన టీడీపీ కూటమి ప్రభుత్వం శాఖల్లోని ఖాళీలను గుర్తించి వెంటనే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వాలి. నేను డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం లేక కూలీ పనులు చేసుకొంటున్నాను. ఉద్యోగాల భర్తీపైనే ఆశలు పెట్టుకున్నాం. అప్పటిదాక నిరుద్యోగ భృతిని అందిస్తే నాలాంటి పేదలకు ఊరట దక్కుతుంది.

– విజయ్, తంబళ్లపల్లె

మాట నిలుపుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగభృతి రూ.3వేలు ఇస్తామని అన్నారే కానీ, ఎవరికి, ఏ వయస్సు వరకు ఇస్తారనే విషయాలపై యువత ఆందోళన చెందుతోంది. జాబ్ క్యాలెండర్, నిరుద్యోగభృతి అమలుపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇచ్చి మాట నిలుపుకోవాలి. చంద్రబాబు పాలనలో ఇంటికో ఉద్యోగం వస్తుందనే ఆశతో నిరుద్యోగులు కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపారు.

– నరసింహ, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి

బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంలకు సన్మానం



పీలేరురూరల్ : బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంలకు ఘన సన్మానం లభించింది. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ముడుపులవేములలో పని చేస్తూ నర్సింగాపురంకు వెళ్లిన హెచ్‌ఎం రామ్మూర్తి, పీలేరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి కలికిరి బదిలీ అయిన జయమ్మ, ఒంటిల్లు నుంచి గ్యారంపల్లెకు బదిలీ అయిన శ్రీహరి తోపాటు ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతిలను సన్మానించారు. హెచ్‌ఎంలు వి.జి. నటరాజ, రెడ్డిబాబురెడ్డి, సురేంద్రనాథరెడ్డి, శివశంకరయ్య, నాగరత్నమ్మ, సావిత్రి, పార్వతి, సత్యనారాయణ, ఝాన్సీలక్ష్మీబాయి పాల్గొన్నారు.

నకిలీ ఎరువుల విక్రయాలను అరికట్టాలి

- అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటు సభ్యుల వాదోపవాదాలు
- రసాభాసగా మండల మీట్


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సబ్రీన్ ముక్తియార్

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలో నకిలీ ఎరువుల విక్రయాలను అరికట్టాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి చర్చకు సిద్ధమా అంటూ సభ్యులు వాదోపవాదాలు చేసుకొన్నారు. దీంతో మండల మీట్ రసాభాసగా మారింది. సోమవారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో ఎంపీపీ సీతమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సభ్యులు పలు సమస్యలను సమావేశంలో చర్చించారు. గుర్రంకొండ పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో నకిలీ ఎరువుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయని సభ్యులు అన్నారు. ఇటీవల వరుస అధికారుల దాడులతో వాస్తవాలు వెలుగు చూశాయన్నారు. అమాయకులైన రైతులను అన్యాయం చేసి నకిలీ ఎరువులతో వాటి పొట్టకొట్టడం దారుణమన్నారు. అధికారులు వీటిపై దృష్టి సారించి డీలర్లపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో జరిగిన అభివృద్ధిపై చర్చ జరగాలని, మండలానికి ఎంత మేరకు నిధులు మంజూరయ్యాయి, ఎంతమేరకు ఖర్చు చేశారో చెప్పాలని చెర్లోపల్లె ఎంపీటీసీ సభ్యులు ప్రసాద్‌నాయుడు డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, అన్ని గ్రామాల్లోను ప్రభుత్వభవనాలు పక్కా నిర్మించామని జెడ్పీటీసీ సబ్రీన్ ముక్తియార్ అన్నారు. ఎంపీటీసీ సభ్యులు వారి పరిధిలోని గ్రామాల్లోని సమస్యలు గురించే మాత్రమే మాట్లాడాలని ఇతర గ్రామాల్లోని సమస్యలపై జోక్యం చేసుకోవద్దని ఎంపీటీసీ సభ్యులు ఖదీర్ అన్నారు. దీంతో టీడీపీ, వైఎస్సార్‌సీపీ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. మీరెంత అంటే మీరెంత అంటూ సవాళ్లు విసురుకొన్నారు. ఎస్ఐ నాగార్జున రెడ్డి తమ సిబ్బందితో సమావేశంలోకి చేరుకొని ఇరుపార్టీల సభ్యులను వారించారు. సమావేశం సజావుగా సాగించేందుకు అందరు సహకరించాలని కోరారు. సభ్యులు వాగ్వివాదాలు మానుకొని గ్రామాల్లో అభివృద్ధిపై దృష్టిసారిస్తే బాగుంటుందని మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎల్వీ రమణ సూచించారు. ఉప తహసీల్దార్ వెంకటయ్య మాట్లాడుతూ మండలంలోని 39 చౌక దుకాణల పరిధిలో రేషన పంపిణీ పూర్తి చేశామన్నారు. మండలంలో తొమ్మిది ఎండీయూ వాహనాలు ఉండగా ప్రస్తుతం రెండు వాహనాల ద్వారా మాత్రమే రేషన్ పంపిణీ జరుగుతోందన్నారు. హౌసింగ్ ఇన్‌ఛార్జ్ ఎఈ కనకరాజ్ మాట్లాడుతూ మండలానికి 937 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 628 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని అన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొన్నవారికి బిల్లులు చెల్లించాలని రామాపురం సర్పంచ్ ఆనంద్ కోరారు. సమావేశంలో ఎంపీడీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఏఓ నాగశివారెడ్డి, వైస్‌ఎంపీపీలు కరుణాకర్, సరస్వతి, ఎంపీటీసీలు గంగులమ్మ, యాకూబ్, సరస్వతి, రాజగోపాల్, బాబయ్య, సర్పంచ్‌లు రౌనఖ్‌భాషా, ఆనంద్‌లు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

– ఆర్డీఓ హరిప్రసాద్

మదనపల్లె : మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఫ్యాక్టరీలన్నింటిలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కే.కృష్ణమూర్తి అధ్యక్షతన ఆర్డీఓ కార్యాలయంలో లోకల్ క్రిసిస్ గ్రూప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ హరిప్రసాద్ మాట్లాడుతూ...పరిశ్రమల్లో ప్రమాదకరమైన కెమికల్స్ వాడకంపై సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫ్యాక్టరీల్లో కెమికల్స్ కారణంగా తలెత్తే ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన అన్ని భద్రతాప్రమాణాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఫ్యాక్టరీలో వాడే కెమికల్స్, వాటిద్వారా కలిగే ఎమర్జెన్సీ, కార్మికులు, ఆస్తినష్టం, పర్యావరణాన్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు డివిజన్ స్థాయిలో జిల్లాలో తొలిసారిగా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో 18 పరిశ్రమలు ఉండగా, అందులో 17 మిల్క్ చిల్లింగ్ సెంటర్స్, పీటీఎం వద్ద 1 స్పిరిట్ ఫ్యాక్టరీ ఉన్నాయన్నారు. మిల్క్‌చిల్లింగ్ సెంటర్స్‌లో అత్యంత ప్రమాదకరమైన కెమికల్ అమ్మోనియాను వినియోగిస్తారన్నారు.3,000 పీపీఎం అమ్మోనియా గాలిలో కలిస్తే ప్రాణాపాయస్థితి ఏర్పడుతుందన్నారు. అందుకే ఫ్యాక్టరీల్లో అమ్మోనియా లీకేజీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫ్యాక్టరీల్లో భద్రతా ప్రమాణాలు, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించేందుకు ఏడాదిలో రెండుసార్లు మాక్‌డ్రిల్ నిర్వహిస్తామన్నారు. లోకల్ క్రైసిస్ గ్రూప్‌కు ఆర్డీఓ చైర్మన్‌గా ఉంటారని, రెవెన్యూ, పోలీస్, ఫైర్, పొల్యూషన్ శాఖలు, ఎంపీడీఓలు, ఎస్‌జీఓ, మీడియా నుంచి సభ్యులు ఉంటారన్నారు. పోర్డ్ వ్యవస్థాపకురాలు జల్లా లలితమ్మ, మున్సిపల్ డీఈ శ్రావణి, డెయిరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదిత్య కాలేజీకి అటానమస్ హోదా

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీకి యుజీసీ (న్యూఢిల్లీ) ద్వారా అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా లభించినట్లు కాలేజీ డైరెక్టర్ రామలింగారెడ్డి, చైర్మన్ రామమోహన్‌రెడ్డి, అధ్యక్షులు నాగమల్లారెడ్డి తెలిపారు. సోమవారం కాలేజీలో వారు విలేకర్లతో మాట్లాడుతూ పదేళ్లపాటు ఈ హోదా ఉంటుందన్నారు. దీని వల్ల కాలేజీ విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. మరింత నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందన్నారు. అటానమస్ ద్వారా సాంకేతిక మార్పులకు అనుగుణంగా పాఠ్యాంశాలు కోర్సులు మార్చుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి సారించడంతో పాటు పారిశ్రామిక శిక్షణ ఇచ్చేందుకు ఈ గుర్తింపు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రుల సమష్టి కృషి వల్ల ఈహోదా లభించిందన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

తంబళ్లపల్లె: గర్భిణులు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే తల్లి, బిడ్డకు ఆరోగ్యం చేకూరుతుందని గైనకాలజిస్టు తేజస్వి తెలిపారు. సోమవారం సీహెచ్‌సీలో గర్భిణులు వివిధ రకాల పరీక్షలతో పాటు స్కానింగ్ నిర్వహించారు. ఆరోగ్య సూచనలు ఇచ్చారు. మహిళలు గర్భం దాల్చిన వెంటనే ఆశా కార్యకర్త దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేసుకోవాలన్నారు. గర్భ నిర్ధారణ అయితే పాలు, పండ్లు, గుడ్ల తో పాటు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అప్పుడే రక్తహీనత దూరమై సుఖప్రసవం జరిగేందుకు దోహదపడుతుందన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించుకుని డాక్టర్ల సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య స్పింది పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పీలేరు : అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య అన్నారు. సోమవారం పీలేరు పట్టణం మహిళా సమాఖ్య భవనంలో 'అధిక వర్షాలు – ఆరోగ్య నియమాలు' అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన నీరు, గాలి, ఆహారం, పరిసరాలు, మన ఆరోగ్యకర జీవనానికి ఎంతో అవసరమన్నారు. శుభ్రత పాటించకపోతే నీళ్ళ విరేచనాలు, టైఫాయిడ్, పచ్చకామెర్లు, జిగటవిరేచనాలు, పోలియో, అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. శుద్ధి చేసిన నీటిని, తాజా ఆహారం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో లక్ష్మణరెడ్డి, ఏఎన్ఎం విజయకుమారి, సీహెచ్‌వో ఆయేషా, సిబ్బంది పాల్గొన్నారు.

20న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పీలేరురూరల్ : ఈ నెల 20న అరుణాచలానికి (తిరువణ్ణామలై ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపనున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలం గిరిప్రదక్షణకు వెళ్లడానికి 20 తేదీ ఉదయం 5.31గంటలకు ఒక సర్వీసు, 10 గంటలకు మరోసర్వీసు పీలేరు నుంచి బయలుదేరుతుందన్నారు. సీట్లు రిజర్వు చేసుకోవాల్సిన భక్తులు కె.వి. రమణ 7893152748 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

తంబళ్లపల్లె: మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్ల నిర్మాణపు పనులు వేగవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్, డీఎల్‌పీఓ నాగరాజు తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయలంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లు, పనులు ప్రారంభించని ఇళ్ల వివరాలపై నివేదిక ఇవ్వాలన్నారు. లబ్ధిదారులను చైతన్యపరిచి నిర్మాణపు పనులు త్వరగా పూర్తి చేసుకునే విధంగా చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యపై శ్రద్ధ చూపాలన్నారు.

అధైర్యపడ వద్దు ..అండగా నిలుస్తా

–ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ఎవ్వరూ అధైర్యపడవద్దు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అండగా నిలుస్తా అని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. సోమవారం ఆయన తంబళ్లపల్లెకు వచ్చారు. ఎమ్మెల్యే స్వగృహంలో నాయకులు, కార్యకర్తలతో ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలపై అందరం పోరాడి పరిష్కరించుకుందామన్నారు. ప్రతి ఇంటికి వివక్షత లేకుండా సంక్షేమ పథకాలు అందించి మరపురాని మేలు గత ప్రభుత్వంలో మేము చేశామన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ప్రజలకు కళ్లకు కట్టినట్లు కనబడుతోందన్నారు. అయితే నేడు టీడీపీ ప్రభుత్వం ప్రజలకు మేలు చేసి అభివృద్ధితో ప్రజలు మన్ననలు పొందాలే తప్ప కక్షపూరితమైన దాడులకు దిగడం సరికాదన్నారు. పనికట్టుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలకు దిగడం ప్రజలు హర్షించరన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడం మాని దౌర్జన్యకాండకు దిగడం చూసి ప్రజలు హేవగించుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయం గుర్తించాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి,నాయకులు నరేంద్రరెడ్డి, వెంకటరమణారెడ్డి, రామమూర్తి, శివారెడ్డి, కోటిరెడ్డి, బాబురెడ్డి, కరీముల్లా, భద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


రైతు సమస్యలపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : టమాటా క్రయవిక్రయాలకు పేరుమోసిన మదనపల్లె మార్కెట్‌లో రైతు సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి, వారి సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం మార్కెట్ కమిటీ రైతు విశ్రాంత భవనంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో.. మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు, సెక్రటరీ అభిలాష్‌లు మార్కెట్‌లో టమాటా వేలం పాటల సమయం మార్పుపై రైతుల నుంచి వినతులు అందిన నేపథ్యంలో అభిప్రాయాలను తెలపాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు 30 ఏళ్లుగా అమలవుతున్న ఉదయం పూట వేలం తమకు అనుకూలంగా ఉంటుందని, సాయంత్రం పూట వేలం నిర్వహణ ఇబ్బందిగా ఉంటుందన్నారు. మార్కెట్‌లో మండీ యజమానులు రైతుల నుంచి 10 శాతం కమీషన్, క్రేట్‌బాడుగలు, కూలీల పేరుతో రూ.6, జాక్‌పాట్ పేరుతో 100కి 10 బాక్సులు తీసుకుంటున్నారని, దోపిడీని అరికట్టాల్సిందిగా వినతిచేశారు. అలాగే వేలం పాటల్లో 1000 రూపాయలు ధర పాడి, పట్టీకి వచ్చేసరికి క్రేట్‌కి 50 తగ్గించి రూ.950 వేస్తున్నారన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనల మేరకే రైతుల నుంచి మండీ యజమానులు కమీషన్ వసూలు చేయాలన్నారు. మార్కెట్‌లోట్రాఫిక్‌సమస్యతో నీరుగట్టువారిపల్లె ప్రధాన రహదారిపై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికి రైతులు, మండీ యజమానులు తమవంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్.ఏ.మస్తాన్, మండీ యజమానుల సంఘం నాయకులు సురేంద్ర, కృష్ణయ్యవర్మ, రైతులు జీ.వి.నాయుడు, మేడిపల్లె శంకరప్ప, రామిశెట్టినాగేంద్ర, జేసీబీ వేణు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డయేరియా నివారణపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పెద్దలకు బీసీజీ టీకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమ, గురు వారాల్లో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అర్హులైన ఆరు వర్గాల వారికి బీసీజీ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. అలాగే డెంగీ, చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి, సిబ్బందికి బీసీజీ టీకాలు వేశారు. అలాగే మండలంలోని నగిరిమడుగు పిహెచ్‌సి డాక్టర్ కీర్తి ఆధ్వర్యంలో స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంక్ వద్ద బ్యాంక్ సిబ్బంది, ప్రజలకు బీసీజీ టీకాలు వేశారు. టిబి యూనిట్ సిబ్బంది నాగిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.